వాణిజ్య సిలిండర్‌పై రూ.48.5 పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: వంటగ్యాస్ ధర మళ్లీ పెరిగింది. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.48.5 పెరిగింది. వరుసగా గత మూడు నెలల నుంచి వాణిజ్య సిలిండర్ ధర పెరుగుతూ వస్తున్నది. మొత్తం ఈ మూడు నెలల్లో రూ.94 మేర పెరిగింది. గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. మరోవైపు, విమాన ఇంధన ధర 6 శాతం తగ్గింది. కిలో లీటరకు రూ.5,883 మేర చమురు కంపెనీలు తగ్గించాయి.

బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలు: సుప్రీం

న్యూఢిల్లీ: బుల్డోజర్ కూల్చివేతలపై మార్గదర్శకాలను జారీ చేస్తామని సుప్రీంకోర్టు మంగళవారం చెప్పింది. ఏదో ఓ మతానికి కాకుండా ప్రజలందరికీ వర్తించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉంటాయని తెలిపింది. ఓ వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా ఉండటం కానీ, దోషిగా నిర్ధారణ కావడం కానీ, ఆ వ్యక్తి ఇంటిని కూల్చేయడానికి తగిన కారణం కాబోదని స్పష్టం చేసింది. అయితే, ఆక్రమణదారులను రక్షించే విధంగా ఈ మార్గదర్శకాలు ఉండబోవని వివరించింది. గుడులు, గురుద్వారాలు, దర్గాలు వంటి మతపరమైన కట్టడాలు ప్రజలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లు, జలాశయాలు, రైలు మార్గాలు వంటివాటిపై ఉండకూడదని వివరించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసింది.

తల్లిని చంపి, తినేసిన వ్యక్తికి మరణ శిక్ష

కింది కోర్టు తీర్పును సమర్థించిన బాంబే హైకోర్టు

ముంబై: తల్లిని చంపేసి, శరీర భాగాలను తినేసిన వ్యక్తికి కింది కోర్టు విధించిన మరణ శిక్షను బాంబే హైకోర్టు మంగళవారం సమర్థించింది. ఇది నరమాంస భక్షణకు సంబంధించిన కేసు అని పేర్కొంది. దోషి సునీల్ కుచ్‌కోరవి 2017 ఆగస్ట్ 28న కొల్హాపూర్‌లోని తన ఇంట్లో తన తల్లి యల్లమ రమ కుచ్‌కొరవిని కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం ఆమె మెదడు, గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ప్రేగులను పెనం మీద కాల్చి, కొన్నిటిని తినేశాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వనందుకు ఇంత దారుణానికి పాల్పడ్డాడు. దోషి సునీల్‌కు కొల్హాపూర్ కోర్టు 2021లో మరణ శిక్ష విధించింది. అతనిని పుణేలోని యెరవాడ జైలుకు తరలించారు. తనకు మరణ శిక్ష విధించడంపై సునీల్ అప్పీల్ చేశాడు. హైకోర్టు అతడి అభ్యర్థనను తోసిపుచ్చి, మరణ శిక్షను సమర్థించింది.

బెంగాల్‌లో మళ్లీ జూడాల సమ్మె

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు మళ్లీ సమ్మెకు దిగారు. మంగళవారం నుంచి నిరవధికంగా, పూర్తిగా విధులను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. జూనియర్ వైద్యులు ఇన్ పేషంట్, ఔట్ పేషంట్ విభాగాల విధులు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొన్న మరుసటి రోజే వారు సమ్మెకు దిగడం గమనార్హం. పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, దవాఖానలలో రక్షణ చర్యలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళనను పునః ప్రారంభించారు. పీజీ జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై 42 రోజుల ఆందోళన తర్వాత సెప్టెంబర్ 21 నుంచి విధులకు హాజరవుతున్నామని, అయితే ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తమ రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. తమపై దాడులు కొనసాగుతూ ఉన్నాయని, అందుకే ఆందోళన తిరిగి ప్రారంభించినట్టు తెలిపారు.

డేరా చీఫ్‌కు మరోసారి పెరోల్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ బయటకు

న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం ఇన్సాన్‌కు మరోసారి పెరోల్ మంజూరైంది. ఆయన సోమవారం చేసిన విజ్ఞప్తిని ఎన్నికల కమిషన్ ఆమోదించింది. హర్యానా శాసనసభ ఎన్నికల తరుణంలో ఆయనకు పెరోల్ మంజూరు చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయనకు రాష్ట్రంలో పలుకుబడి ఉందని, ఆయన జైలు నుంచి బయటకు వస్తే, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆరోపించింది. ఆయనకు పెరోల్ మంజూరు చేయరాదని ఈసీకి విజ్ఞప్తి చేసింది. ఆయన పెరోల్‌పై తాత్కాలికంగా జైలు నుంచి విడుదల కావడం ఇది 15వ సారి.

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

- సుమారు 500 మిస్సైల్స్, రాకెట్ల ప్రయోగం
- అమెరికా హెచ్చరించిన కొద్ది గంటల్లోనే దాడి
- బాంబుల మోతతో దద్దరిల్లిన టెల్ అవీవ్
- వేలాది మంది పౌరులు సురక్షిత ప్రాంతాలకు
- ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు.. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని సైన్యానికి బైడెన్ ఆదేశాలు
- పశ్చిమాసియాలో మరింత తీవ్రమైన ఉద్రిక్తతలు
- లెబనాన్‌లో భూతల దాడులకు దిగిన ఇజ్రాయెల్

జెరూసలేం, అక్టోబర్ 1: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఇజ్రాయెల్-హమాస్, హెజ్బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇప్పుడు ఇరాన్ కూడా ప్రత్యక్షంగా దిగింది. మంగళవారం సుమారు 500 క్షిపణులు, రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. దీంతో టెల్ అవీవ్ బాంబుల మోతతో దద్దరిల్లింది. పలు భవనాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఇజ్రాయల్ హెచ్చరికలు జారీ చేసింది. వేలాది మందిని బాంబు షెల్టర్లకు తరలించింది. దాడులను అడ్డుకోవడానికి తన రక్షణ వ్యవస్థను సిద్ధం చేసింది. లెబనాన్‌లో హెజ్బొల్లా నేతల మరణాలకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులకు దిగింది. ఇరాన్ దాడులను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) కూడా ఎక్స్‌లో నిర్ధారించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ సాయంత్రం అత్యవసరంగా సమావేశమై పరిస్థితులపై చర్చించింది. ఏడాది కాలంలో సెక్యూరిటీ క్యాబినెట్ ఇలా సమావేశం కావడం ఇదే ప్రథమం. కాగా, దాడిని ఇరాన్ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌పై డజన్లకొద్దీ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ దాడులకు ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించింది.

ఇరాన్ దాడుల నేపథ్యంలో షెల్టర్‌లో తలదాచుకున్న ఇజ్రాయెల్ పౌరులు

అమెరికా హెచ్చరించిన విధంగానే..

ఇరాన్ తక్షణం క్షిపణి దాడులు చేయడానికి సిద్ధంగా ఉందని అమెరికా ప్రకటించిన కొద్ది గంటల్లోనే దానిని నిజం చేస్తూ ఇరాన్ దాడికి దిగడం గమనార్హం. ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అమెరికా చూస్తూ ఊరుకోదని ఉన్నతాధికారి ఒకరు హెచ్చరిక కూడా చేశారు. అయితే దీనిని ఇరాన్ బేఖాతరు చేస్తూ దాడికి దిగింది. దీనిపై ఇజ్రాయెల్ మిలటరీ స్పందిస్తూ ఇప్పటివరకు ఇరాన్ వైపు నుంచి ఎలాంటి ప్రమాదాన్ని గుర్తించలేదని, అయితే ఈ దాడితో తాము అప్రమత్తమయ్యామని, తమ రక్షణ, దాడి వ్యవస్థలను దానికి అనుగుణంగా సిద్ధం చేసినట్టు మిలటరీ చీఫ్ లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో సైరన్‌ల ద్వారా పౌరులను అప్రమత్తం చేసినట్టు ఆయన చెప్పారు. అయితే దాడులతో ఏ ప్రాంతాలు దెబ్బతిన్నవి, మరణాల గురించి ఆయన వివరించ లేదు. మరోవైపు అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతు తెలిపింది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని బైడెన్ అమెరికా సైన్యాన్ని ఆదేశించారు. కాగా, ఇరాన్ దాడి నేపథ్యంలో భారతీయులంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, బయటకు రావద్దని ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ మన దేశ పౌరులకు విజ్ఞప్తి చేసింది.

ఇరాన్ క్షిపణులను అడ్డుకొంటున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ వ్యవస్థ

టెల్ అవీవ్‌లో ఉగ్ర దాడి

టెల్ అవీవ్‌లోని జఫాలో ఉగ్ర దాడి జరింది. మంగళవారం సాయంత్రం జెరూసలేం వీధిలో కొందరు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారని ఇజ్రాయెల్ పోలీసులు తెలిపారు. ఉగ్రవాదులిద్దరూ పోలీస్ కాల్పుల్లో మరణించారు. రైలులోంచి దిగిన ఈ ఇద్దరు ఉగ్రవాదులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో పౌరులు చాలామంది నేలపై బోర్లా పడుకుని కాల్పుల నుంచి తప్పించుకోగా, నలుగురు మరణించారు. కొందరు గాయపడ్డారు.

లెబనాన్‌పై భూతల దాడులు

లెబనాన్‌లో భూతల దాడులను ఇజ్రాయెల్ ప్రారంభించింది. ఇప్పటివరకు వైమానిక దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. తాజాగా లెబనాన్ భూభాగంలోకి ప్రవేశించి దాడులు మొదలుపెట్టింది. అందులో భాగంగా లెబనాన్ సరిహద్దు సమీపంలో ఉన్న సుమారు రెండు డజన్ల గ్రామాల ప్రజలను తక్షణం ఇళ్లు వదిలి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ మిలటరీ మంగళవారం హెచ్చరికలు జారీ చేసింది. అలాగే తమ వాహనాలను ఉత్తర ప్రాంతం నుంచి దక్షిణ లిటానీ నదివైపు తరలించవద్దంటూ పౌరులకు ఎక్స్‌లో హెచ్చరికలు చేయగా, తమ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశించినట్టు వచ్చిన వార్తలను హెజ్బొల్లా ఖండించింది. లెబనాన్‌లోకి ప్రవేశించే ఏ చర్యనైనా దీటుగా ఎదుర్కొంటామని హెజ్బొల్లా ప్రతినిధి మహమ్మద్ అఫిఫ్ పేర్కొన్నారు.

మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై దాడి

టెల్ అవీవ్‌కు సమీపంలోని గిల్లాట్ ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు హెజ్బొల్లా ప్రకటించింది. మిలటరీ ఇంటెలిజెన్స్ యూనిట్ 8200, టెల్ అవీవ్ శివారులోని మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై నాలుగు రాకెట్లను ప్రయోగించినట్టు తెలిపింది. అలాగే సెంట్రల్ ఇజ్రాయెల్‌పై మధ్యంతర క్షిపణులను ప్రయోగించామని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని పేర్కొంది.

మా గూఢచారి చీఫ్ మొస్సాద్‌కు ఏజెంట్: ఇరాన్ మాజీ అధ్యక్షుడు

ఇజ్రాయెల్ రహస్య గూఢచార వ్యవస్థ మొస్సాద్ ఇరాన్ సీక్రెట్ సర్వీస్‌లోకి చొరబడిందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అహ్మదీనెజాద్ ఆరోపించారు. సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మొస్సాద్ కార్యకలాపాలను అడ్డుకోవడానికి ఇరాన్ ఏర్పాటు చేసిన సీక్రెట్ సర్వీస్ చీఫ్ తమను మోసం చేసి మొస్సాద్‌కు ఏజెంట్‌గా మారిపోయాడని ఆరోపించారు. అతనితో పాటు మరో 20 మంది ఇజ్రాయెల్‌కు డబుల్ ఏజెంట్లుగా పనిచేశారన్నారు. వీరంతా ఇరాన్‌లో జరిగే అనేక రహస్య ఆపరేషన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌కు అందజేసేవారని, పలు డాక్యుమెంట్లు అపహరించేవారని, అలా అపహరించిన వాటిలో ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని ఆయన వెల్లడించారు. వీరి చర్య కారణంగానే ఇరాన్ న్యూక్లియర్ సైంటిస్టుల మరణం సంభవించిందన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గతంలో ఇరాన్ అణు కార్యక్రమాల గురించి వెల్లడిస్తూ వాటి పత్రాల గురించి తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ముగిసిన జమ్ముకశ్మీర్ ఎన్నికలు

చివరి విడతలో 69% పోలింగ్ • అక్టోబర్ 8న ఫలితాల ప్రకటన

జమ్ము, శ్రీనగర్, అక్టోబర్ 1: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం జరిగిన మూడో, ఆఖరి విడత ఎన్నికల్లో 69 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. జమ్ము, సహా జమ్ముకశ్మీర్‌లోని 40 అసెంబ్లీ స్థానాలకు పటిష్ఠ బందోబస్తు మధ్య ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. 370 అధికరణ రద్దు తర్వాత మొదటిసారి జరిగిన ఈ ఎన్నికలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు సహా అన్నింటిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8న వెలువడతాయి.

ఈ వాన కాలంలో 7.6% అధిక వర్షపాతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ఈ ఏడాది రుతుపవన సీజన్‌లో 7.6 శాతం అధిక వర్షపాతం నమోదైందని భారత వాతావరణ విభాగం మంగళవారం తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలో అధిక వర్షాలు కురిశాయని వెల్లడించింది. మధ్య, దక్షిణ, ఈశాన్య భారతంలో అక్టోబర్-డిసెంబర్ మధ్య కాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. భారత వ్యవసాయ రంగానికి రుతుపవన సీజన్ ఎంతో కీలకం. దేశంలోని మొత్తం నికర సాగు భూమిలో 52 శాతం ఈ వర్షాలపైనే ఆధారపడి ఉంటుంది. తాగునీటికి, విద్యుత్తు ఉత్పత్తికీ ఈ వర్షాలు కీలకం.

ఎవరెస్ట్‌ను పైకి నెడుతున్న నది

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: సాధారణం కంటే అధిక వేగంతో ఎవరెస్టు ఎత్తు ఏటేటా పెరుగుతున్నది. దీనికి కారణం ఓ నది అని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎవరెస్టు కింద భూగర్భంలో ఉండే టెక్టోనిక్ ప్లేట్ల కదలికల వల్ల వాస్తవానికి ఏటా 0.04 ఎంఎం నుంచి 1 ఎంఎం మాత్రమే పెరగాలి. కానీ, ప్రస్తుతం 0.08 ఎంఎం నుంచి 2 ఎంఎం ఎత్తు పెరుగుతున్నది. దీనిపై యూనివర్సిటీ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయగా ఎవరెస్టు కింద భాగంలో నదుల ప్రవాహం పెరుగుతూ ఎవరెస్టు ఎత్తుకు కారణం అవుతున్నట్టు తేలింది. ఎవరెస్టుతో పాటు పక్కనున్న పర్వతాలు కూడా దీనివల్ల ప్రభావితానికి గురయ్యాయని వెల్లడైంది.

వారణాసిలోని ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాల తొలగింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరమైన వారణాసిలోని పలు ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించడం ఉద్రిక్తతకు దారితీసింది. కాషాయ శ్రేణులతోపాటు కొందరు హిందూ స్వామీజీలు కలిసి దాదాపు 10 ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించారు. వారణాసిలోని ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను తొలగించాలని సనాతన రక్షక దళ్ (ఎస్ఆర్‌డీ), బ్రాహ్మిణ్ సభ కలిసి కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నాయి. అందులో భాగంగానే విగ్రహాలను తొలగిస్తున్నారు. తాము సాయిబాబాకు వ్యతిరేకం కాదని, కాకపోతే ఆయన విగ్రహాలకు మాత్రం ఆలయాల్లో చోటు లేదని ఎస్ఆర్‌డీ అధ్యక్షుడు అజయ్‌శర్మ పేర్కొన్నారు. సాయిబాబా కోసం ఏర్పాటు చేసిన ఆలయాల్లో ఆయన భక్తులు పూజలు నిర్వహించుకోవచ్చని, సనాతన ధర్మంపై ఏమాత్రం అవగాహన లేని కొందరు ఇతర ఆలయాల్లోనూ సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యుడు, విష్ణువు, శివుడు, శక్తి, గణేశుడి విగ్రహాలను మాత్రమే ఆలయాల్లో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

ముడా భూములు వెనక్కి

- సిద్ధరామయ్య భార్యకు కేటాయించిన 14 స్థలాలు తిరిగి తీసుకున్న అధికారులు
- భూములు వెనక్కి ఇవ్వడమంటే నేరాన్ని అంగీకరించినట్టే: బీజేపీ
- సీఎం రాజీనామాకు డిమాండ్

బెంగళూరు, అక్టోబర్ 1: కర్ణాటక ముడా స్కామ్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు వెనక్కి తీసుకున్నారు. ముడా కుంభకోణం నేపథ్యంలో, తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య సోమవారం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

నేరాన్ని అంగీకరించినట్టే: బీజేపీ

బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర మంగళవారం మాట్లాడుతూ పార్వతి 14 స్థలాలను ముడాకు అప్పగించడానికి సిద్ధపడ్డారంటే ముడా కుంభకోణంలో తప్పు జరిగిందని అధికారికంగా ఒప్పుకున్నట్టేనని అన్నారు. వెంటనే సీఎం సిద్ధూ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అది ఆమె సొంత నిర్ణయం: సిద్ధరామయ్య

ముడా కుంభకోణంలో తనకు ఎలాంటి పాత్ర లేనందున తన పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. అసలు ఏ కారణాలతో తనపై మనీ లాండరింగ్ ఆరోపణలు మోపారో తనకు అర్థం కావడం లేదని అన్నారు. భూములు అప్పగించినంత మాత్రాన నేరం ఒప్పుకున్నట్టు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. విపక్షాల రాజకీయాలకు తన భార్య కూడా పావుగా మారిందని, భూములు అప్పగించాలని తీసుకున్న నిర్ణయం ఆమె సొంతమని, దానిలో తన ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. తనకు వ్యతిరేకంగా జరిగిన విద్వేష రాజకీయాలకు తన భార్య బాధితురాలిగా మారిందని, భూములు అప్పగించాలన్న ఆమె నిర్ణయం తనను ఆశ్చర్యపరిచిందని అన్నారు.

ఏ క్షణంలోనైనా ఈడీ సమన్లు

ముడా స్కామ్‌లో ప్రథమ ముద్దాయిగా ఉన్న సిద్ధరామయ్యను ప్రశ్నించడానికి ఏ క్షణంలోనైనా ఈడీ సమన్లు జారీ చేయొచ్చునని అధికార వర్గాలు తెలిపాయి. సిద్ధరామయ్యతో పాటు, అతని సహచరులు, బంధువులు, సన్నిహితంగా మెలిగే ఒక మంత్రి కదలికలను అధికారులు ఇప్పటికే నిశితంగా పరిశీలిస్తున్నారు. వారికి చెందిన బ్యాంక్ ఖాతాలు, ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని ఈడీ సేకరించింది. మరోవైపు లోకాయుక్త బృందం మైసూర్ నగర శివారులో ఉన్న ముడా స్కామ్ వివాదాస్పద భూమిలో సర్వే నిర్వహించారు.

వాంగ్‌చుక్ నిర్బంధం

ఢిల్లీ సరిహద్దుల్లో పాదయాత్ర అడ్డగింత

నిరసనగా పోలీస్‌స్టేషన్‌లో నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: లఢక్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ 'ఢిల్లీ చలో పాదయాత్ర' చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, మరికొందరిని ఢిల్లీ సరిహద్దుల్లో సోమవారం రాత్రి పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. దీనికి నిరసనగా వాంగ్‌చుక్, మరికొందరు మంగళవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. లఢక్‌కు రాష్ట్ర హోదా కల్పించి ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ గత నాలుగేండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. అయితే నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించినందుకే వాంగ్‌చుక్, మరికొందరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. వాంగ్‌చుక్‌ను కలవడానికి ఢిల్లీ సీఎం ఆతీశీకి ఎల్జీ అనుమతి ఇవ్వలేదు.

ఆగని ఉద్యోగాల ఊచకోత

టెక్ రంగంలో కొనసాగుతున్న ఉద్యోగ కోతలు

ఈ ఏడాది ఇప్పటివరకు 1.4 లక్షల మందిపై వేటు

న్యూఢిల్లీ: ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో పొదుపు మంత్రాన్ని జపిస్తున్న టెక్ కంపెనీలు తమ నిర్వహణ ఖర్చులను తగ్గించుకునేందుకు ఉద్యోగుల సంఖ్యను భారీగా కుదించుకుంటున్నాయి. 2024 ప్రథమార్థంలో లేఆఫ్‌ల ద్వారా వేల మంది టెకీలపై వేటు వేసిన పలు కంపెనీలు ద్వితీయార్థంలోనూ అదే పరంపరను కొనసాగిస్తున్నాయి. ఈ జాబితాలో ఐబీఎం, మైక్రోసాఫ్ట్, సిస్కో, డెల్, ఇంటెల్, క్వాల్కమ్, నార్త్‌వోల్ట్ లాంటి బడా కంపెనీలతోపాటు డోజీ, ఉయ్ ట్రాన్స్‌ఫర్ లాంటి చిన్నచిన్న స్టార్టప్ కంపెనీలు సైతం ముందు వరుసలో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 511 కంపెనీల్లో 1,39,206 మంది టెకీలు ఉద్యోగాలను కోల్పోయినట్టు 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' వెల్లడించింది.

భారీగా తొలగింపులు...

ఈ ఏడాది ఫిబ్రవరిలో దాదాపు 4 వేల మంది ఉద్యోగులపై వేటు వేసిన సిస్కో.. రెండో విడతగా తమ మొత్తం సిబ్బందిలో 7% (దాదాపు 5,600 మంది) ఉద్యోగులను తొలగించనున్నట్టు ఆగస్టులో ప్రకటించింది. ఈ ఏడాది ఆరంభంలో పలువురు ఉద్యోగులను తొలగించిన ఐబీఎం సంస్థ.. తాజా విడతలో ప్రధానంగా సీనియర్ ప్రోగ్రామర్లతో పాటు సేల్స్, సపోర్ట్ సిబ్బందిపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నది. ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన గేమింగ్ విభాగమైన 'ఎక్స్‌బాక్స్' తోపాటు కార్పొరేట్, సపోర్ట్ విభాగాల్లో 650 ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించగా.. స్మార్ట్‌ఫోన్ చిప్‌ల తయారీలో అగ్రగామి సంస్థగా కొనసాగుతున్న 'క్వాల్కమ్' త్వరలో శాన్‌డిగోలో 226 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్టు వెల్లడించింది. ఇదేవిధంగా స్వీడన్‌లో దాదాపు 1,600 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని భావిస్తున్నట్టు బ్యాటరీల తయారీ సంస్థ నార్త్‌వోల్ట్ గత నెలలో ప్రకటించింది.

ఫేక్ సుప్రీం విచారణతో 7 కోట్లు టోకరా

పారిశ్రామికవేత్త ఓస్వాల్ డిజిటల్ అరెస్ట్ • హైటెక్ మోసానికి పాల్పడ్డ సైబర్ నేరగాళ్లు

న్యూఢిల్లీ: హైటెక్ మోసాలతో ఎంతోమంది ప్రముఖులను బురిడీ కొట్టించిన సైబర్ మోసగాళ్లు తాజాగా ఓ పారిశ్రామికవేత్తను తమ బుట్టలో వేసుకున్నారు. బాధితుడిని అతని ఇంట్లోనే రెండు రోజులపాటు డిజిటల్ అరెస్ట్ చేసిన దుండగులు.. ఆయన నుంచి రూ.7 కోట్లు తస్కరించారు. ఇందుకోసం ఏకంగా ఓ ఫేక్ సుప్రీంకోర్టును, నకిలీ సీజేఐని సృష్టించారు. తాము సీబీఐ, ఈడీ అధికారులమంటూ బాధితుడిని ఆన్‌లైన్‌లో విచారణ చేసి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డుచేసి, ఆన్‌లైన్‌లోనే కోర్టులో హాజరుపరిచారు. ఆయనపై నేరారోపణ చేసి.. శిక్షగా రూ.7 కోట్లు జరిమానా విధించి వివిధ అకౌంట్లలోకి ఆ డబ్బును జమచేయించుకున్నారు. ఈ హైటెక్ మోసానికి గురైన వ్యక్తి ప్రముఖ వస్త్ర ఉత్పత్తి సంస్థ వర్ధమాన్ గ్రూప్ చైర్మన్ ఎస్పీ ఓస్వాల్.

నకిలీ సుప్రీం.. నకిలీ సీజేఐ..

ఓస్వాల్ కథనం ప్రకారం ఆయనకు ఆగస్టు 28న ఒక ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే 9 నంబర్ నొక్కాలని అప్పటివరకు ఫోన్ డిస్‌కనెక్ట్ కాదని అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో ఓస్వాల్ 9 నంబర్ నొక్కాడు. వెంటనే అవతలి నుంచి ఒక వ్యక్తి తాను సీబీఐ కొలాబా (ముంబై) ఆఫీసు నుంచి మాట్లాడుతున్నానని అంటూ ఒక ఫోన్ నంబర్ చెప్పి అది ఓస్వాల్ పేరిట ఉందని చెప్పాడు. ఎవరో తన పేరుతో ఆ నంబర్ తీసుకొని వాడుతున్నారని అన్నాడు. అలాగే కెనరా బ్యాంక్‌లో తన పేరిట ఒక అకౌంట్ ఉన్నదని కూడా చెప్పాడు. దీంతో ఓస్వాల్ వెంటనే తనకు కెనరా బ్యాంక్‌లో ఎటువంటి ఖాతా లేదని చెప్పాడు. కానీ అవతలి వ్యక్తి.. అది ఓస్వాల్ పేరుతోనే ఉన్నదని, ఆ ఖాతా నుంచి అక్రమంగా కొన్ని ఆర్థిక లావాదేవీలు జరిగాయని అన్నాడు. గత ఏడాది హవాలా కేసులో అరెస్టయిన జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్ కేసుకు సంబంధించి ఈ ఆర్థిక లావాదేవీలు జరిగాయని చెప్పాడు. ఈ కేసులో ఓస్వాల్ కూడా అనుమానితునిగా ఉన్నాడని అన్నాడు. ఆ అకౌంట్ తనది కాదని, తనకు నరేశ్ గోయల్ ఎవరో తెలియదని ఓస్వాల్ చెప్పారు. అయినప్పటికీ.. ఆ బ్యాంకు ఖాతా తన ఆధార్ కార్డు ఆధారంగా ఉన్నదని అవతలి వ్యక్తి చెప్పాడు. తాను అప్పుడప్పుడు జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రయాణించానని, బహుశా గుర్తింపు కార్డుగా తన ఆధార్‌కార్డును వారికి చూపించి ఉంటానని ఓస్వాల్ చెప్పారు. అయినాసరే.. తమ దర్యాప్తు పూర్తయ్యేంతవరకు తనను డిజిటల్ కస్టడీలో ఉండాలని చెప్పారని, తమకు సహకరిస్తే కేసు నుంచి బయటపడేస్తామని కూడా వారు హామీ ఇచ్చారన్నారు. ఇదంతా వీడియో కాల్‌లో జరిగిందని ఓస్వాల్ వివరించారు. తనతో మాట్లాడిన వ్యక్తి చీఫ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాహుల్ గుప్త